# 8. శిక్ష

కొత్తకాపరం. మొదటిరోజు ఉదయాన - పూర్ణహస్తం మీద తయారైన కాఫీని ఒక్కసారి చప్పరించి, కనుబొమల్ని ముడుస్తూ, "ఏడ్సినట్టేవుంది" అని శివరావు విమర్శించాడు.

"ఏం తక్కువైంది?"

నిజానికి దాంట్లో ఏం తక్కువైందో అతని జిహ్వ సరిగ్గా సూచించలేకపోయినా, అది రుచిగ్రహణశక్తిని కోల్పోలేదని రుజూచేసుకునేందుకు, "అన్నీ తక్కువే-" అన్నాడు.

"ఐతే మళ్ళీ కలుపుతా-"

ఆ మోడరన్ కేఫ్ తన కళ్ళకు కన్పిస్తూన్నంతసేపూ, తన జేబులో నాలుగు రాళ్ల గలగలమనే శబ్దం తన చెవులకు తగులుతూన్నంతసేపూ ఇంక యే ఇతర కాఫీ అయినా సరే తనను తాగించలేదని తనకు తెలుసు!

"ఒద్దులే - బైట తాగుతా... నీక్కూడా తెచ్చిపెట్టనా?"

ఈ మాటలు అన్నాడేకాని, ఆమె దీనికి తల ఊపుతే మాత్రం, ఈ కూలిపన్ని తప్పించుకొనే మార్గం ఏదా అనే ఆలోచనకు గురయ్యాడు.

"నాకు బాగానేవుందిలెండి-"

"బతుకు జీవుడా" అనుకొన్నాడు.

"బజారునుంచి ఏం కావాలి?"

"ఉప్పూ, మిరపకాయా, చింతపండూ, ఇంగువా..." లిస్టు ఏకరువు పెడుతోంది.

శివ విసుక్కుంటూ, "అవ్వేం వొద్దు - హోటల్‌నుంచి భోజనం వస్తుందిలే-" అన్నాడు.

"ఎందుకూ? నేను వండుతాగా."

"నీ పాకమైతే- నాకు ఏకాదశే!"

అన్నపూర్ణ చిన్నపుచ్చుకోకుండానే నవ్వి "పోనీండి- మీ ఇష్టం" అంది.

"నీకేం కావాలి?"

"ఏమీవొద్దు-"

"సరే- నేను వెళ్తున్నా."

"సాయింత్రం వెళ్ళకూడదూ?"

"తొందర పనివుంది"

"మీకూ పనులకూ చాలా దగ్గరి చుట్టరికం-"

శివ మాట్లాడకుండా లేచి రెండడుగులు ముందుకు వేశాడు. వెనుకనుంచి ఆమె, "త్వరగా వస్తారా?" అంది.

"ఊ" అని దీర్ఘం తీస్తూ శివ బజార్లో పడ్డాడు.

## 2

తను చేసిన పనిని ఏమనాలో తనకు తెలీదు కాని, యీ మూఢసంఘం దాన్ని 'లేచిపోవడం' అని వ్యవహరిస్తుంది. తను దానికి ఒప్పుకోడు. అసలు ఆమెను తను వెంటపెట్టుకొని మెడ్రాస్ రావటంలో తన ఉద్దేశం 'ఫలానా' అని కూడా తనకు తెలీదు. తను కొంతవరకూ తొందరపడ్డాడేమోనని కూడా ఆలోచించాడు; కాని, తనను ప్రోద్బలం చేసి వేధించుకుతిన్న పూర్ణదే ఆ తప్పని సమాధానం చెప్పుకున్నాడు.

గొప్ప తప్పు చేసినవాడి హృదయం పొందే వ్యాకులత వొకటి తనలోకూడా వుంది- తనది తప్పా? ఇది బాగా స్వార్థానికి ఉపయోగపడటంవల్లనేమో తనకు తప్పుగా తోచకపోవడం! మరి ఆ వెధవ భయం? పుట్టినప్పట్నుంచీ వాతావరణంలో వింటూన్న 'పాపం' అనే పదం ఇచ్చే భయంకర అర్థం తాలూకుది కాబోలు!

అయిందేదో అయింది - దాన్ని గూర్చి మనస్సు పాడు చేసుకోవటం మంచిది కాదు. ఇకముందుమాత్రం తను పూలరంగడల్లే సంచరించవచ్చనే సంతోషంతో అతని హృదయం నిండిపోయింది. అసలు తనకు జీవితంమీద రోతపుట్టి ఈ కష్టభూయిష్ఠ జీవితంకన్నా ఆత్మహత్యతో విముక్తిపొందటం మేలని తలచిన క్షణాలు చాలా ఉన్నై;

కాని అప్పుడు తనొక మూఢుడై ఉండాలని అతనిప్పుడు అనుకున్నాడు. పరిస్థితుల్ని పట్టి హృదయ పరిణామఛాయలన్నీ మారుతూంటాయి కాబోలు!

అసలు తన జీవితపథంలో యీ మేరుపర్వతం ఒకటుందని కలలో కూడా ఊహించలేదు. తనను 'అప్రయోజకుడు'గా ఎంచిన ప్రపంచం – ఈనాడు తన 'ప్రయోజకత్వాన్ని నోరు తెరుచుకు చూస్తూంది! తన ధైర్యానికీ, సంఘాన్ని ఎదురించి నిలిచిన మొండితనానికీ ముక్కుమీద వేలేసుకుంటూంది. ఏమైతేనేం – జీవితంలోకల్లా అతి విలువైన క్షణాలివ్వి! తన జీవితచరిత్ర యీ లోకానికి ఎప్పటికైనా అవసరమైతే– ఇప్పటి ఘట్టాల్ని మాత్రం సువర్ణాక్షరాల్తో లిఖించాల్సి ఉంటుందనుకున్నాడు.

ఈ వారంలోనూ తను గొప్ప పట్టణవాసిగా మారిపొయ్యాడు. తనకు ఇల్లొక బందిఖానాగా కన్పించింది. పూర్ణమీది దృష్టి అంతా టాక్సీలమీదా, సినిమాలమీదా, బీచీలమీదకూ పరుగెత్తసాగింది. ఆమెలో కన్పించే నూతనత్వాన్ని యీనాడు తన కళ్లు సరిగ్గా గుర్తించలేవు– ఎంతో పాతపడ్డట్టయింది! 'ప్రేమ' వొక్కటే జీవితానికి అవసరమని తను ఇదివరకు చేసుకున్న సిద్ధాంతాన్ని తప్పుగా గుర్తించాడు. ఒక్క డబ్బు ఖర్చుపెట్టటమూ తిని తిరగటమే శివకు విశ్రాంతిలేని ఉద్యోగమైపోయింది!

పూర్ణ యీ రకం జీవితాన్ని ఎప్పుడూ వాంఛించనేలేదు. ఒక్కతే ఇంట్లో బిక్కు బిక్కుమంటూ కూర్చొని, గోళ్లు గిల్లుకుంటూనో, గోడమీద బల్లివైపు చూస్తూనో, కిటికీలోంచి బజార్లో నడిచే వివిధ వ్యక్తుల్ని చూస్తూనో కాలం గడపాల్సి వచ్చింది. వంటపనికూడా లేకపోటంవల్ల తను సోమరిగా మారుతూన్నా ననుకొంది. ఇన్నాళ్ళూ తను పదిమంది స్త్రీలమధ్య కూర్చొని ఉపన్యాసాల్ని దంచేది. ఇప్పుడు గోడలకూ, తలుపులకూ పాఠాలు నేర్పాలి! ఇల్లా భాషకూడా మరిచిపొయ్యే స్థితి వస్తుందేమోనని గూడా ఆమె తలచింది. ఆమెకు ఇల్లొక ఖైదుగా వుంది.

"ఎప్పుడూ మీరు తిరగటంలోనే గడుపుతే–?" అంది ఒకనాడు.

శివ "ఏం?" అన్నాడు ప్రశార్థకంగా చూస్తూ.

"నాకు ఇంటి దగ్గర యేమీ తోచడంలేదు. పక్కభాగాలవాళ్ళతో బాతాఖానీ కొడదామంటే నాకా అరవ భాష రాదాయె! పోతే సౌజ్ఞల ద్వారా మూగవాళ్ళలాగు మాట్లాడుకోవాలా!"

"బజారుకు వెళ్దాం వస్తావా?"

నిజానికి పూర్ణకిది ఇష్టంలేదు. ఐనా ఇంతకన్న చేసేదీ లేదు! ఆ నగరాన్ని తను చూడలేదు – ఇప్పుడు చూద్దామనే వుంది! ఆ భర్తతో – ఉహుఁ– చేసుకొన్న భర్త కాదు. కాని ఊళ్లో అందరూ తన భర్తగానే చూస్తున్నారు అతన్ని. ఆ పదాన్నే లోకం 'ప్రియుడు' అంటుంది– ఇంకేమేమో అంటుంది. ఏమైనా తనకు భర్తే– ఆ భర్తతో వెళ్ళి వస్తేనేం?

"ఇప్పుడు వెళ్దామా?"

"ఊఁ."

ఎన్నడూలేని కొత్తసంస్కరణ వొకటి శివలో ప్రవేశించింది. దంపతులు బజార్లలో కలిసి తిరగటం - తన సంస్కరణకు కొత్తమెట్టు!

ఆమెను వెంటవేసుకొని దాదాపు ఊరంతా తిప్పాడు. అనేకషాపుల్ని చూపాడు. నాలుగైదుసార్లు కార్లకిందా, ట్రాములకిందా పడేందుకు సిద్ధమైనా ఆమెకు యీ నూతన ప్రపంచం బాగుంది. తనకన్నా వడిగా నడుస్తూన్న శివతో పరుగెత్తలేక (అందుకని ఆమెది హంసగమనం అనేందుకు వీల్లేదు.) అతన్ని ఆపాలని ప్రయత్నించేది. ఏమైనా శివ తన వేగాన్ని తగ్గించనూలేదు, ఆమె హెచ్చించనూలేదు! బుద్ధితక్కువై బజారు వచ్చానని లోలోపల ఆమె చెంపలు వాయించుకొంది. ఆ ఆడవాళ్ళల్లో తెగబలిసి కూర్చున్న నాగరికతకు ఎందుకోగాని ఆమె చీదరించుకొంది.

"పూర్ణా!- పూర్ణా!..."

పెద్దకేక విని ఇద్దరూ వెనక్కు తిరిగి చూశారు. దాదాపు ఫర్లాంగు దూరంనుంచి ఆమె ముసలిబాబాయ్‌గాడు ఊడిపోతూన్న పంచను చేత్తోపట్టుకొని, ముసలి కళ్ళజోడు ముక్కుమీద నాట్యంచేస్తూండగా - రోజుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు. ఈ అస్థిపంజరంగాణ్ని చూసిన శివకు గుండెల్లో దడపుట్టింది.

"పూర్ణా! వాణ్ని ఎల్లాగైనా పంపేసి నువ్వు ఇంటికి పో - ఇప్పుడే వస్తాను" అనేసి, ఆమె సమాధానాన్ని కూడా విన్పించుకోకుండా, పక్కసందులోంచి మైల్ రేస్‌చేసి మాయమయ్యాడు శివ!

బాబాయ్ పరుగెత్తుకొచ్చి యుద్ధంలో వెన్ను చూపిన శత్రువును చీల్చి చెండాడేవాడిలాగు పాతగొడుగును గాలిలో - ఖడ్గంలాగు విసురుతూ ఉద్రేకంతో, "ఏడీ? వాడేడీ?" అన్నాడు.

"దేనికీ?"

"దేనికా? చెప్తాలే-పా-"

"ఎక్కడికీ?"

"మన ఊరు వెళ్ళిపోదాం."

"నేను రాను-" నిశ్చయాన్ని వెలిబుచ్చే కంఠంతోనే ఆమె అంది.

"నీకు పిచ్చెక్కింది, ఎక్కడైనా కూర్చొని మాట్లాడుదాం-పా-"

కొంచెం ఆలోచించి ఆమె, "మా ఇంటికి వెళ్దాం-" అని రిక్షాను పిలిచి బాబాయ్‌తో బయలుదేరింది.

## 3

మంచంమీద కూలబడుతూ సభాపతి అన్నాడు-

"ఎంత మారిపొయ్యావ్ - పూర్ణా!"

తనలోని మార్పు తనకే తెలీకపోవటంవల్ల పూర్ణ తనను తను, 'మారిపొయ్యానా?' అని ప్రశ్నించుకొంది. దానికి ఆమె అంతరాత్మ ఇచ్చిన సమాధానం 'ఏమో!'

సభాపతి చిటికెడు ముక్కుపొడుంతీసి నాశికా రంధ్రాల్లో కూరి నసాళం అంటేట్లు పీల్చి - ముక్కు తుడుచుకున్నాడు - ఉపన్యాసకుడు తను సిద్ధంగా ఉన్నట్టు సూచించే విధంగా!

"నీ ప్రవర్తన ఎవరికీ బాగుండలా... ఇల్లా చెడిపోతావని ఎవ్వరూ అనుకోనూ లేదు."

"పోనీ ఇప్పుడు అనుకుంటున్నారుగా!"

"చెడ్డపేరు తెచ్చుకునేందుకు ఎక్కువ కాలం అక్కర్లేదు పూర్ణా! మంచి పేరు తెచ్చుకునేందుకు సామాన్యజీవిత పరిమితి కూడా చాలదు."

కళ్ళు రెండూ అప్పగించి పూర్ణ చూస్తూ కూర్చుంది.

"ఆయన కుమిలిపోతున్నాడు"

"దేనికి?"

సభాపతి కళ్ళు సాధ్యమైనంతవరకూ సాగాయ్.

"ఎందుకా?- నువ్వుచేసిన ఘనకార్యానికి-"

"ఉహుం."

"నిన్ను వెంటపెట్టుకు తీసుకురమ్మన్నాడు."

పూర్ణకు తన సంసారకూపమంతా కళ్ళకు కట్టినట్టయింది. ఆమె ఆ దృశ్యాన్ని తలుచుకోలేక- తన బాధనంతా కోపకంఠంలో ఇముడ్చుకొని అంది: "ఆయన ఆజ్ఞల్ని శిరసావహించే దాసీలు ఇక్కడెవరూ లేరు"

"భర్తమాటను చెవిన వేసుకోవటం కూడా లోకానికి విరుద్ధమేనా?

"నీకేం తెలుసు కక్కా? ఆ ఇల్లు నాకొక యమలోకం-"

"ఆc. ఆయన ధర్మరాజు-"

"కాదు; యమధర్మరాజు-" నవ్వింది.

"నీకు అక్కడ జరిగిన లోపం?"

"ఒక్క ఐశ్వర్యంతోనే స్త్రీ బంధింపబడుతుందనే దురూహతో ఉన్న ఆయన హృదయం! మాదీ ఒక కాపరమేనా కక్కా? స్త్రీత్వాన్ని శరీరంలో దాచుకొని సిగ్గుతెరల చాటున పదిమందికీ చెప్పుకోరాని లోపం! ఎదుటి వాళ్ళు అడగనూరాదు, నేను చెప్పనూరాదు- ఇది సభ్యతకు విరుద్ధం! నీకు తెలీదా ఇది? తెలుసు... నా నోటి వెంట చెప్పిస్తేకాని మీకు వినోదంగా ఉండదు. ఇదంతా ఎందుకూ-

నేను రానన్నానని చెప్పు... నీ రాయబారం నిష్ఫలమైందని చెప్పు - వారు నా భర్తకారు- తాత అని చెప్పు-"

సభాపతి ఉగ్రంగా చూస్తూ అన్నాడు:

"నీకు మతిపోతోంది పూర్ణా! ఉత్తమ ఇల్లాలివై సకల సౌఖ్యాల్నీ అనుభవిస్తా వనుకొన్నా! ఇల్లా కులటవౌతావని నేను కల్లోకూడా అనుకోలా-"

"లోకమంతా ఉత్తమ ఇల్లాళ్ళే ఐతే - వారికి ప్రత్యేక స్థానం ఉండదుగా!- ఐనా ఇందులో నీ తప్పేమీ లేదుగా!"

కాసేపు కడుపునిండా గాలిపీల్చి తను చెప్పబొయ్యే దాన్ని ఊహించుకొని, సభాపతి మళ్ళీ అందుకున్నాడు: "ఐందేమో ఐంది. ఊరంతా ఒక్కపెట్టున సోమయాజుల్ని దూషిస్తున్నారు. నువ్వు చేసిన యీపనికి నీలోని వేడిరక్తమే కారణం - నామాట విను: అరవైఏళ్ళ జీవితానుభవాన్ని పొంది ఉన్న మాటలివి: ఎవడో ఊరూ పేరూ లేనివాణ్ని నమ్మి గోతిలో పడటం దేనికి? మన వంశానికీ, కులానికీ కూడా కళంకం! బంధువులమధ్య బతకాలి; ఐనవాళ్ళం తల ఎత్తుకు తిరిగేందుక్కూడా అవకాశం లేకుండా వుంది..."

"బంధువులా? నాకెవ్వరూలేరు కక్కా! ఒకవేళ వున్నా నాజోలి వారెవ్వరికీ అక్కర్లేదు; తల్లిలేదు, తండ్రిలేదు- ఈ అనాధకు ఎవ్వరూ జాలి చూపక్కర్లేదు-"

కొద్దికోపాన్ని కక్కుతూ సభాపతి అన్నాడు: "లేరా? నిన్ను చిన్ననాటినుంచీ కడుపులోపెట్టుకు కాపాడాను. నా సంతానంలాగే అల్లారుముద్దుగా పెంచాను. ఈ చేతులమీద ఎత్తుకు తిప్పాను. నీకు సలహా ఇచ్చేపాటి అధికారాన్నికూడా నాకివ్వని విశ్వాసహీనురాలవయ్యావా? ఇంత గడుసుతనం నీ శరీరంలో ఏ మూల దాగివుందో నాకు తెలీటంలేదు. బతికి వున్నంతకాలమూ మా బాధ్యతలు తీరవు. నీ శ్రేయస్సు కోరేవాళ్ళల్లో నేనే ప్రథముణ్ణని నీకు వేరే మనవి చేసుకోనక్కర్లేదు- పెంచి పెద్దదాన్ని చేసి, పెళ్ళిచేసాను - అన్నీ మరిచిపోయినట్టు చూస్తావేం?"

"పెళ్ళా కక్కా? ఆ బొమ్మలపెళ్ళి? నన్నొక ప్రాణం వున్న రబ్బరుబొమ్మలాగు ఆ ముసలికోతికి ఆటవస్తువుగా అమ్మావ్! వారి పాదాలకిందపడి నలిగిపోవటానికి బానిస ననుకున్నావ్! పశు వయినా ఒక్కొక్కసారి ఎదురు తిరుగుతుంది; నేనూ

మానవమాత్రురాల్నేగా! నాక్కూడా కోర్కెలతో నిండిన శరీరం వొకటివుంది- మీకది కనపడదు. కన్పించినా ఒప్పుకోరు! నా సౌఖ్యాలకు మీరెందుకు అడ్డురావాలి? మిమ్మెవర్నీ నేను అడ్డుపెట్టలేదే! ఈ సంఘం మీలాటి పెద్దమనుషులందర్నీ దిక్కులేనివాళ్ళమీద కొరడాలు విసరమని ఫర్మానా ఇచ్చిందా! నా జీవితం రాణించినా క్షీణించినా నేనే బాధ్యురాల్నవుతాను- నన్ను నిర్బంధించొద్దు-"

"ఇది నిర్బంధన కాదు- పిచ్చిపిల్లలాగు మాట్లాడుతావేం? ఇంత తల వంపులపని-"

"కావొచ్చు."

సభాపతికి పట్టలేనంత కోపం వచ్చింది.

"చిన్నపిల్లవుకావు పూర్ణా- తలబిరుసు సమాధానాల్ని ఇచ్చేందుకు! లోకజ్ఞానం లేనిదానివని చెప్తున్నా-" కోపపు కంఠం తీసేసి మృదువుగా అన్నాడు: "నీకు తోచదు, నేను చెప్తే వినవ్! వాడు రౌడీ- నిష్ప్రయోజకుడు! ఎల్లాగో నిన్ను మోసగించాడు. రేపు నిన్ను వదలి వెళ్తాడు - నీగతేం కాను?"

"చేసుకున్న భర్తలూ, భార్యలే ఒకళ్ళ నొకళ్ళు వదుల్తూంటే - వారిగతేంకాను?"

"అందరి సంగతీ మనకెందుకు?... పోనీ ఇందాక చూడు- నన్ను చూడగానే ఉడాయించిన పిరికిపంద! వాడి మీద జీవితభారాన్ని వేస్తావా? ఇవ్వాళకాదు- రేపటిగతి ఆలోచించు-"

"అక్కడ ఇంతకన్నా ఘోరంగా-"

"పొరపడుతున్నావ్- పూర్ణా! నీ భర్త దయామయుడు. మూడువేల రూపాయల నగలతోనూ, రెండువేల రూపాయల రొఖ్ఖంతోనూ నువ్వు పారిపోయినా నిన్నేమీ అనలేదు. నీ తప్పును ఆయన క్షమిస్తాడు- ఎల్లాగో నేను సర్దిచెప్తా - లోకులకు తెలీకుండా - పుట్టింటికి వెళ్ళిందని చెప్తా- తెలిసిందా?"

తన మాట విన్నదనే సభాపతి ఆశ!

"ఈ బుకాయింపు మొదట నామీదా, తరువాత లోకులమీదానా? కక్కా - ఆయన నన్ను క్షమించాల్సినంత నేరంకాదు నాది. ఆయన పరాయివ్యక్తి! ఒక్కడబ్బు వుంది కదా ననేగా- యీ అహంభావం? కొండలుగా ఆయనింట్లోపడి మూలుగుతూన్న డబ్బులో కొంతభాగంపోయినా ఆయనకు లెక్కలేదు. వెధవ ఐదువేలకు క్షమించడూ మరి? ఆ కరెన్సీ నోట్లన్నీ జేబుల్లో కుక్కుకొని మరీ చావమను! నన్ను తనభార్యగా లోకం వ్యవహరిస్తే భుజాలు ఎగరేసుకొని సభాపూజ్యతకు దేకులాడే స్వార్థపరుడు - ఒక చిన్నపిల్ల జీవితాన్ని దగ్ధంచేసిన పెద్దమనిషి! ఆయన నన్ను కాదు- నేనే ఆయన్ను

క్షమించాలి- క్షమిస్తున్నా కూడా!" ఆ ఉద్రేకానికి ఆమె ముఖమంతా నుదుటవున్న కుంకుమవర్ణంతో కలిసిపోయింది.

"మాటలు నేర్చావ్‌లే పూర్ణా! బుద్ధిలేదూ? రేపు బజార్లో ముఖం చూపగలవూ? నువ్వుచేసిన చౌర్యానికి ఆయన పోలీసురిపోర్టు ఇవ్వకుండా ఊరుకున్నాడంటేనే- తెలుస్తోంది ఆయన ఉదారస్వభావం! ఆయన తలుచుకుంటే రేపీపాటికి మీ ఇద్దర్నీ శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపగలడు."

"కక్కా! నన్ను భయపెట్టాలనే వృధా ప్రయాస దేనికి? అక్కడ ఆ జైలుకన్న పోలీసువాళ్ళ జైలే నయం! రెక్కలు వచ్చిన పక్షిని పంజరంలో బంధిస్తే అదిపడే వేదన- పైనుండి వినోదార్థం చూసేవాళ్ళకు తెలుస్తుందా? ఒక్క పనిచెయ్: ఎల్లాగూ అబద్ధమాడేందుకు సిద్ధంగానే వున్నావ్ కనుక - అయనతో నేను కన్పించనేలేదని చెప్పు-"

"అబద్ధంకూడా ఆడాలీ?"

"లోకులతోనూ, నాతోనూ ఆడితే పట్టింపులేదేం?"

"ఇంక ఆపు: ఇంత బతుకూ బతికి నీ మూలానా పరువూ మర్యాదల్నీ పోగొట్టుకోవాల్సిన రాతపట్టింది-" అని కస్సునలేచి: "వాడేడీ? వాణ్ని పోలీసులకు అప్పగిస్తే కాని నువ్వు దారికిరావు; చిన్నపిల్లకు శ్రీరంగనీతులు నూరిపోసిన తుంటరి వెధవ-ముష్టి వెధవ-" ఇంక చెప్పటం అనవసరమన్నట్టు పళ్ళు పటపటమనిపించాడు.

"ఆయన్నెందుకంటావుగాని శాంతంగా కూర్చో"

సభాపతి కోపం తగ్గలేదు; కాని ఇందాకటి విసురు కొంత తగ్గింది.

"మన బంగారం మంచిదైతే కంసాలిని అనక్కర్లేదులే!- నామాట విను పూర్ణా! గుట్టుచప్పుడుగా వెళ్ళిపోదాం. తరవాత అనుకోకపోవ్... ఒకనాడు కక్క బతిమాలినా విననందుకు శిక్షపడ్డదని!-"

"ఇంక యీ ప్రస్థావన్ను ఆపెయ్ - తలనొప్పికూడా వస్తోంది. నేను ముమ్మాటికీ రాదల్చుకోలేదు- సరేనా?"

"ఇంత మొండిబండ వయ్యావనుకోలేదు- ఇంతేనా?"

"ఇంతేకాని, ఆయనతో చెప్పు: తన భార్య మొదటి భార్యలాగే పరలోకాల్లోకి పోయిందనుకోమని! నేనొక్కతెనూ లేకపోతే మీ బంధువర్గానికి లోటురాదని-"

ఇక లాభంలేదనే నిర్ధారణ సభాపతి నిట్టూర్పుతో బైటపడ్డది. ఐనా, చివరిమాటగా తగ్గుస్థాయిలో అన్నాడు: "ఇదిగో - యీ చివరిమాట కూడా విను: నువ్వు చేసేది గుట్టుచప్పుడుగా అక్కడే చేస్తే సరిపోనుగా! ఇంత దూరం వచ్చి మా అందర్నీ ఏడిపించి, నువ్వు ఏడవటం దేనికీ?"

నవ్వి అంది: "ఈనాడు మీ అందరూ రహస్యంగా వుంటే ఒప్పుకుంటారా? నేను ఎల్లా చచ్చినా మీకు అక్కర్లేదు కాని, మీ గౌరవానికి మాత్రం భంగం రాకూడదూ? బలే- కక్కా! ఇల్లాంటి బంధువర్గానికి ఒక్కటే నమస్కారం. ఈ ముసుగులో గుద్దులాట నా కొద్దు కాని-"

"కృతఘ్నురాలవు-" అని పీరులాంటి శరీరాన్ని వాకిటి మట్టానికి లేపి కోపధూమాల్ని కక్కుతూ, "సరే నేను వెళ్తున్నా- ఇంక నీ ముఖం చూడదల్చుకోలా. నీకు మేము అక్కర్లేనప్పుడు, మాకు నువ్వు కూడా అక్కర్లేదు... సరే- ఆ డబ్బు ఇటుపడెయ్-" అన్నాడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

"డబ్బూలేదు- గిబ్బూలేదు సార్! నన్ను యీ రెండు సంవత్సరాలూ అనుభవించి నందుకూ, భార్యగా పరిగణించుకొన్నందుకూ ఐదువేలు- ఇంతకన్న తక్కువధర గిట్టుపాటవదు- నా దాసీత్వానికిది ప్రతిఫల మనుకోమను-"

"డబ్బుకు ఆశపడ్డ జారిణివి-"

"పోనీలే- నన్నిచ్చి వివాహం చేసినంత మాత్రానే రెండు మూటల్ని పాతరేసిన నువ్వో?"

సభాపతి లోలోపల నొచ్చుకొని, తలవాల్చి, నేలను గట్టిగాతంతూ, "ఏమన్నా చావ్-" అని ఒక శాపాన్ని విసిరి వెనక్కు తిరిగైనా చూడకుండా చరచరా సాగిపొయ్యాడు.

పూర్ణ దభేలుమని తలుపు వేసింది.

## 4

భయోత్పాతంతో ముచ్చెమట్లు పోశాయ్. అందుకనే శివ మోడరన్ కేఫ్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోంచి గంటదాకా బైటికి రాలేకపోయాడు. పైన గిరగిరా తిరిగే ఎలక్ట్రిక్ ఫాన్‌లాగే అతని బుర్రకూడా గిరగిరా తిరుగుతోంది. కొంపతీసి – ఆ బాబాయ్‌గాడు తనను పోలీసులకు అప్పగిస్తే... పూర్ణసంగతీ?... అది తరువాత చూసుకోవచ్చు; ముందు తన పునాదికే ఎసరుపడ్డది!

నడుం నొప్పిపట్టేదాకా కుర్చీని అంటిపెట్టుకొని కూర్చున్నాడు. తిని తిరగమరిగిన ప్రాణికి అది పెద్దబోనైపోయింది. వచ్చే పొయ్యే జనమూ, కళ్ళజోడులోంచి తీక్షణంగా చూసే ప్రొప్రయిటరూ తనను మరింత బెదరగొడుతున్నారు. ఏమైతే అయిందని మొండిగాలేచి, బిల్లు చెల్లించి బజార్న పడ్డాడు.

ట్రాముల్లోనైతేనేం, బస్సుల్లోనైతేనేం, కాలినడకనైతేనేం- దాదాపు నగరమంతా గస్తీ తిరిగాడు. ఎక్కడా కూర్చోబుద్ధి పుట్టటం లేదు.

మౌంట్ - వంచినతల ఎత్తకుండానే చరచరా సాగిపోతున్నాడు.

“శివరావ్!”

చచ్చా ననుకున్నాడు. చూస్తూచూస్తూనే గోతిలో పడ్డాడు! వెనక్కు తిరిగి చూసేపాటి దమ్ములేదు- పరుగెత్తటానిక్కూడా కాళ్ళు రాలేదు.

“శివరావ్!”

స్థాయి ఎక్కువౌతోంది - నిస్సందేహంగా తననే! బోనులోపడ్డ ఎలకలాగు ప్రమాదావస్థలో పడ్డాననుకున్నాడు. ఐనా విన్పించుకోనట్టు చరచరా సాగిపోతున్నాడు. రోడ్డు మీది జనం తన వింతప్రవర్తనను గమనించి, లోలోపల పరామర్శ చేసుకుంటున్నట్టు ‘ఫీ’లయ్యాడు.

“శివరావ్!”

అదెక్కడిదో - కంచుగొంతు! నక్షత్రకుడిలాగు వెంటపడ్డాడు. తిరిగీ తిరిగీ అలసివున్న శివకాళ్ళు పరుగెత్తేందుకు ఎదురు తిరుగుతున్నయ్. ఆ కంఠంమాత్రం ముసలివాడిది కాదని తన చెవులు గుర్తించాయ్. వాడు కాకపోతేనేం- వాడి తాలూకు జింటాన్‌గాడు మరోడు! ఇంతకూ తన రోజు మంచిది కాక దేహశుద్ధికోసమూ... ఇంకా...?

“శివరావ్... శివరావ్... శివరావ్!”

వెధవపీనుగు - తన నీడకన్నా ఘోరంగా తరుముతున్నాడు. తనే మొండి అయితే- వీడు శతమొండీ, సహస్రమొండీ అవతారాల్ని ప్రదర్శిస్తున్నాడు. ఇంక తను విశ్వరూప సందర్శనంతో ఎదురుతిరగటమో, లేక కిక్కురుమనకుండా ‘దాసోహం’ అనటమో- రెండే మిగిలాయ్.వెనుక వాడు పరుగెత్తుతూన్నట్లు కూడా... గ్రహించాడు. ఇంక లాభంలేదు... రోడ్డుమీద పరాభవమూ, రసాభాసా కాకుండా - మంచిమాటల్తో... ఆ వ్యక్తికి నచ్చచెప్పి - వాడు చదివే దండకాల్నీ, పంచాంగాల్నీ ఏకాంతస్థలంలో చచ్చినట్లు భరించటమే మేలు! ఈ నిశ్చయంతో సడెన్‌బ్రేకుపడ్డ కారల్లే ఆగి ఆ కేక తన ప్రశాంతిని ఇప్పుడే భంగపరిచినట్టు, వెనక్కు తిరిగి చూశాడు.

“చెవుడు కూడానా?” ఆ వచ్చిన వ్యక్తి శివరావు భుజాన్ని బలంగానే ఊపాడు.

శివలో పనిచేస్తూన్న భయమూ, గియమూ ఏమూల మాయమయ్యాయో కాని- ఈ పాత స్నేహితుడు రాజారావ్‌ను తలవని తలంపుగా చూడటంతో ఒక విధమైన ఆశ్చర్యం అతన్ని ఆవరించింది.

"గుర్తురాలేదా?"

"ఆc... నువ్వా? ఎవరో అనుకొని... హడలిపొయ్యా-"

"హడలటం దేనికీ?"

తన గూడుపుఠానీ సంగతి జ్ఞాపకమొచ్చి, "అదే ... ఆశ్చర్యం..." అని మాటల ధోరణితో పాటు గొంతుకూడా మార్చి, "సరేకాని... ఇక్కడుంటున్నావేం?" అన్నాడు.

ఇద్దరూ కలిసి నడకసాగిస్తూండగా రాజా అన్నాడు: "ఇక్కడా?... ఒక ఫిలింలో యాక్టు చేసేందుకు వచ్చాం. కాని కొన్ని అవాంతరాలవల్ల ప్రొడ్యూసరుబాబు మధ్యలోనే హడిలిపోయి శంకరగిరిమాన్యాలు పట్టాడు. దాంతో తప్పనిసరిగా మేమందరం మెద్రాస్ రోడ్లన్నీ ఖరాబ్ చెయ్యాల్సొచ్చింది-"

ఇద్దరూ ఒక్కసారే నవ్వారు.

చిన్ననాటి స్నేహాన్నీ, తమ కాలేజీ జీవితాన్నీ కూడా జ్ఞాపకం చేసుకుంటూ- అవ్వే సౌఖ్యదినాలని నిర్ధారణ చేశాడు- రాజా! శివ దీనికి పైకైతే తలవూయించాడు కాని, లోలోపల, "అవ్వికాదు- ఇవ్వే!" అనుకున్నాడు.

"అసలు తమరు ఇల్లా దయచెయ్యటానికి కారణం?"

ఈ ప్రశ్నకు నిజమైన సమాధానం ఇవ్వటమా మానటమా అనే తర్కంలో పడ్డాడు- శివ.

తన ప్రశ్నకు సమాధానం రాకపోవటంవల్ల రాజా "నీకు నిజంగా చెవుదుందిరా-" అన్నాడు కొంచెం హెచ్చుస్థాయిలో- ఇప్పుడన్నమాటలు కూడా గాలికే ఎగిరిపోతయ్యేమోనని!

పెదవి విరుస్తూ శివ, "ఏదో గాలిపాటు-" అన్నాడు.

"గాలిలో ఎగిరిపొయ్యేటంత తేలిగ్గా లేవే నువ్వు!"

"తరవాత చెప్తాలే కాని, ఎక్కడైనా తమకు కొంప వుందా? చెట్టుచాటూ పుట్టచాటేనా?

"ఏదో చెత్తగది వొకదాన్ని స్వంతం చేశాంలే."

"వెళ్దాం-పా"

ఇద్దరూ కలిశాక రాజా 'కరీం' బీడీల్ని పూర్తిగా విసర్జించి, శివ ఖర్చు మీద గోల్డ్‌ఫ్లేక్‌సిగరెట్లు ఊదిపారేస్తున్నాడు. ఆ పగలంతా రాజా గదిలోనే శివ కాలక్షేపం చేసి - కంపరమెత్తిన శరీరానికి కొంత విశ్రాంతిని ఇచ్చాడు.

## 5

ఎలక్ట్రిక్ దీపపు నీడలో నిలబడి శివ అన్నాడు: "ఇదిగో చూడు కుడిచేతివైపున నాల్గో ఇల్లు- ఆ ఎత్తరుగుల్ది- అక్కడకు వెళ్ళి 'శివరావుగారూ!' అని పిలు-"

"దేనికీ?" అన్నాడు రాజా.

"చెప్తాగా - తలుపు తెరవబడేదాకా వదలవోక ... ఒకామె వస్తుందిలే. శివరావ్‌గారు లేరంటుంది; 'సభాపతిగారు ఉన్నారా?' అను: ఆ సమాధానాన్ని తీసుకొని ఇక్కడున్నట్టురా- తెలిసిందా?"

తల ఊపాడేకాని రాజాకు ఇదంతా అగమ్యగోచరంగా వుంది. పదినిమిషాలపాటు దూరంనుంచి చూస్తూ శివ నిలబడ్డాడు.

"ఏరా?"

"ఎవ్వరూ లేరట!"

ఈ జవాబుతో శివలో ఇంకాకొద్ది మోతాదుల్లో ఆక్రమించివున్న భయపుఉష్ణత జారింది. రాజాగాణ్ని తనతో తీసుకువెళ్ళటమా, మానటమా అనే కొత్తసమస్య వొకటి ఎదురైంది.

"ఆమె- ఎవర్రా?"

'వెధవ అప్పుడే నరవాసనా - నారీవాసనా కూడా పట్టాడు' అనుకొని- "మా ఆవిడ-" అని ముక్తసరి సమాధానాన్ని జారీచేశాడు.

చాలు- ఈ మాత్రం రక్షచాలు! పొలానికి దిష్టిబొమ్మలాగైనా యీ 'భర్త' అనే చిటకా పనిచెయ్యకపోదు!

"పా-వెళ్దాం" నీరస స్వరంతో అని శివ, రాజాతో పాటే రెండడుగులు ముందుకువేశాడు.

"కాపరమే పెట్టావన్నమాట-"

"అన్నమాటేమిటి - నీ శార్ధం? కాపరమైతే!"

"ఉహుఁ."

శివ ఇంటిగుమ్మంలోకి చరచరా నడిచి, తలుపు గుద్దుతూ, "పూర్ణా... పూర్ణా!" అని పిలిచాడు.

రాజా రోడ్డుమీదనుంచే యీ దృశ్యాన్ని కన్నార్పకుండా చూస్తున్నాడు. వీడు తనను పురోగామిగా పంపటమూ, ఏదో తన ఇంటి విశేషాన్ని వాసనపట్టమని ఫర్మానా జారీచెయ్యటమూ, పగలస్తమానమూ మేకులాగు తన గదిలో కూర్చొన్నా - యీ

కాపరం సంగతే తనతో చెప్పకపోవటమూ- ఇవన్నీ కలిసి రాజాలో కొద్ది అనుమాన ధూళిని రేకెత్తించాయ్. కాని స్నేహితుడు తనదగ్గర అబద్ధం ఆడడనే తలపుకు ఆ కారణాలన్నీ తల లొంచేశాయ్.

ఆమె తటాలున తలుపు తెరిచింది.

"సరే నేనుంటానోయ్-"

"ఏం వెళ్దువుకానిలే- రా" ఇంక బాగుండదన్నట్టు పిల్చిన కంఠమది!

"కాదులే - పనివుంది- మళ్ళీ రేపు కలుస్తాగా"

"సరే... ఉదయాన నేనే మీ గదికి వస్తాలే-"

"ఆల్‌రైట్-" రాజా ఎత్తి ఎత్తి ముందుకు అడుగులు వేయసాగాడు.

స్నేహితుడి భార్యను పగటిపూట చూసేందుకు మర్నాడున్న అవకాశం కాస్తా పోయింది; తనూ, శివా మట్లాడుతూండగా ఆమె తనవైపు ఏకాగ్రదృష్టిని ప్రసరింపజేసింది. కాని, ఆ శనిగాడు ప్రత్యేకంగా తనవైపు తిరిగి మాట్లాడుతూండటమూ, కొంపంతా ముంచుకుపోతూన్నట్టు కార్పోరేషన్‌వాళ్ళ లైటు వెలుగంతా తన ముఖంమీదనే పడుతూండటమూ, ఏదో గుడ్డివెలుగుమాత్రమే ఆమెను ఆవరించటమూ - ఇవన్నీ తనకు ప్రతిబంధకాలు కావటంవల్ల, ఆమె చూపులకు మారుచూపుల్ని పంపుకోలేకపొయ్యాడు. స్త్రీని దీక్షగా చూడటం నేటి సభ్యతా ప్రపంచానికి విరుద్ధం కాబట్టి, ఆమె నిలబడ్డ స్థలాన్ని శూన్యంగా భావించి, ప్రవర్తించాడు. ఐనా తను మొట్టమొదటిసారి వెళ్ళినప్పుడు ఆమెను చూశాడు. ప్రత్యేకంగా మిలమిలా మెరిసే ఆమె బంగారు ఆభరణాలు తనను ఎక్కువ ఆకర్షించి, 'బాగానే సంపాయించాడు' అనే సర్టిఫికెట్టును శివకు ఇప్పించగలిగాయ్. యేవేవో వెర్రిమొర్రి ఆలోచనలతో రాజా - పదిగంటలకు చివరిసారి సంచరించే బస్సులోపడి కొంపజేరాడు.

## 6

శివరావు వెనకాల్నే ఆమె తలుపు గడియపెడుతూ, 'చాలా ధైర్యస్థులు!' అని ఉదయం సభాపతి తనను పేరుపెట్టి పిల్చినప్పుడు శివ ముఖభంగిమను జ్ఞాపకంచేసుకొని విరగబడి నవ్వసాగింది.

ఆమాటల్లోని నిగూఢతను గుర్తించి శివ- తన పిరికితనానికి తనలోతనే నవ్వుకొని- గంభీరంగా, "ఇంకాపు- ఆ నవ్వు" అన్నాడు.

ఆమె చీర చెరగును నోట్లో కుక్కుకుంటూ ఇంకా నవ్వుతూనే అంది: "రైల్లో... నాతో కోసినకోతలు! ఆ ఉత్తరకుమార ప్రజ్ఞలు... ఏ ఫ్లాటుఫారంమీదన్నా... మనను పట్టుకున్నట్టయితే...?"

తరువాతి పదాలన్నీ ఆమె నవ్వులో కలిసిపొయ్యాయ్; ఆమె చెప్పకపోయినా చేతిగాజులు చప్పుడయ్యేట్టు, ఆమె గాలిలో ఊగించిన చెయ్యి 'తమరు ఏమీ ఎరగనట్టు కాళ్ళకు బుద్ధిచెప్పేవాళ్ళేకదూ?' అని చెప్తూనేవుంది.

"అబ్బ! పోనిద్దూ అదంతా... ఇదుగో! నీకే చెప్తోంది... ఇంకచాల్లే... తమరు శ్రావ్యంగా నవ్వుతారని తెలుసుకున్నాను కాని..."

ఆమె ఎల్లాగో తంటాలుపడి నవ్వు ఆపుకొంది.

"వాడు- ఏమైనాడు?"

"ఎవరు?- మీ పినమామగారా?"

ఇందాక పూర్ణను రాజాదగ్గర 'భార్య'గా చేసుకున్న మాట వృథా పోని సంబంధం! ఐనా ఏమిటీ అసందర్భపు వరస?

"ఛట్!... ఆ ముసలికోతిగాడు నాకేం పినమామ-? పినమామట!"

"కోతిక్కూడా భయపడే జంతువేదబ్బా?" అని ఆమె ఆలోచనను నటించింది.

"చాల్లే. వాడికి భయపడి తప్పుకున్నానా యేం? నడి బజార్లో రసాభాస ఔతుందనికాని-" చెప్తూన్నమాట ఆపి, ఆమె తనమాటల్ని నమ్మిందో లేదోనని చూశాడు. కాని ఆమె ముఖభావం తనకు అర్థమవనేలేదు.

"ఇంతకూ వాడేడీ?"

"పోలీస్ స్టేషన్‌కు-" సీరియస్‌గా ఆమె అన్న యీ మాటలకు శివ అదిరిపడ్డాడు.

"దేనికీ?"

"మీ మీద రిపోర్ట్ ఇస్తాట్ట"

"నువ్వు ఇమ్మన్నావా?"

"నన్ను రమ్మన్నాడు; మీ ఆజ్ఞలేందే నేను రానన్నాను. ఆ ఆజ్ఞకోసం పోలీసుల్ని పిల్చుకొస్తానని వెళ్ళాడు-"

"నేను అనుకుంటూనేవున్నా - ఇంతపనిచేసి, నన్ను ముప్పతిప్పలూపెట్టి, మూడుచెరువుల నీళ్ళూ తాగిస్తావని. నా ఆజ్ఞట- బోడి ఆజ్ఞకోసం వేచికూర్చున్న పతివ్రత!-" అని కోపంతో లేచి నిలబడ్డాడు. వాలకంమాత్రం తోకముడిచే రకంలోనే వుంది. ఇంక పాకం ముదురుతుందని ఆమె అంది: "ఇంత పిరికితనమైతే ఎట్లా? ఆయన్ను పంపేశాలెండి- ఈపాటికి, కలకత్తా మెయిల్‌లో ఏ లెట్రిన్ పక్కనో పడుకొని గుర్రుపెడుతూ వుంటాడు."

ఈ మాటలు విన్నాక, శివకు సముద్రంలోపడి ప్రాణాల్తో ఒడ్డుజేరినంత సుళువుగావుంది. ఐనా వెళ్ళాడో లేదో నమ్మకం ఏమిటి?

తాపీగా కూలబడుతూ, "వెళ్ళాడో, ఈ ప్రాంతాల్లో నాకోసం తారట్లాడుతున్నాడో?" అన్నాడు. ఒక క్వశ్చన్‌మార్కు ఫాలభాగంలో ప్రతిబింబమయ్యేట్టు.

"ఏం ఐతే? మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డమెయ్యనూ?"

ఆమె మాటల్తో శివకు మంచి ధైర్యమొచ్చి, "ఏడ్చాడులే! ఉండిమాత్రం నన్నేంచేస్తాడు కాని- ఇక్కడికి వస్తే వాడి వీపు విమానంమోత మోగదూ?" అన్నాడు చొక్కాచేతుల్ని పైకి సర్దుకుంటూ.

"అబ్బ! ముసలివాళ్ళ వీపుల్ని చెడకొట్టే వస్తాద్ గార్లూ...!"

"అసలు మన సంగతి తెలిసే వాడు శీఘ్రంగా సర్దుకున్నాడు-" అంతా తన ప్రతాపమేనన్నట్టు చూశాడు.

"ఆ...ఆఁ మీరేకదూ? ఆయన్ను చూసేప్పటికి ఆంజనేయ దండకాన్ని జపించుకొని-" మళ్ళీ కాస్సేపు ఆమె నవ్వింది.

ఇట్లా ఆడదాని ఎదుట నవ్వులపాలు కావటం శివకు తలవొంపులుగానే వుంది. ఆ సభాపతిని ఆ బజార్లోనే పట్టుకొని, వొంగదీసి నాలుగో, ఐదో టన్ను గుద్దుల్తో దేహశుద్ధి చేసినట్లయితే బాగుండేది- ఐనా యీసారి వాడు కంటపడాలీ - ఇంటికి వెళ్ళేవాణ్ని తను ఆస్పత్రికి పంపాలి!- దీన్ని నిరూపించేందుకు శివ కళ్ళు కూడా ఉరిమాడు- ఎదుటఉన్న దొడ్డిగోడవైపు చూస్తూ!

తరువాత ఇద్దరూ క్యారియర్‌లోని భోజనాన్ని ఒకే విస్తట్లో పెట్టుకొని తినసాగారు.

"మీతో వచ్చిన ఆయ నెవరండీ?"

"స్నేహితుడు- సినిమాయాక్టరు..."

"ఉదయంనుంచీ ఎక్కడున్నారు?"

"వాడి గదిలోనే! చింతాద్రిపేటలో..." ఈ సంభాషణతో పాటు భోజనం కూడా పూర్తయింది. శివ సిగరెట్ పీల్చేలోపల ఆమె పై పని పూర్తిచేసుకొంది.

శివ మంచంమీద కూర్చొని, ఆమెను పక్కనే కూర్చోపెట్టుకొని, ఆమె రాచి ఇచ్చే తమలపాకుల్ని బుగ్గకిందకు తోస్తూ- సభాపతికీ, ఆమెకూ జరిగిన సంభాషణా వివరాల్ని వినసాగాడు. ఆమె ఆ సందర్భంలో చూపిన ధైర్యాన్ని ముద్దుల్తో మెచ్చుకుంటూ, తనివితీరని ఆమె మాటలకు నాటకానికి రిజర్వుడు టిక్కెట్టు కొన్నవాడికన్న ఎక్కువ ఉత్సాహంతో వన్స్‌మోర్లు కొడుతూ- థర్డ్‌ఫారం ప్యాసయిన పిల్లస్నేహం తనలాటి విద్యాధికుడికి లభించినందుకు, 'విధిని' లోలోపల మెచ్చుకున్నాడు.

"ఇంకా ఏమన్నాడు?"

"అబ్బ! అంతేనండీ–"

"సరిగ్గా జ్ఞాపకం చేసుకో."

"వెనకటికి మీలాటిరాజు తనకు ఎంతకూ తరగని కథ చెప్పమన్నాట్ట..."

"అది నాకు తెలుసులెద్దూ..."

"తెలుస్తే కిక్కురుమనకుండా పడుకోండి" అని ఆమె తననోటితో అతని నోటిని మూస్తూ, పక్కపయిన వాలింది.

## 7

ఆపత్ సమయంలో అడ్డుపడ్డవాడు శివ ఒక్కడే కనుక – రాజాకు అతనిమీద అంత గురి ఏర్పడి ఉంటుంది. రాజాకు తను నెలకు కనీసం వందరూపాయల్ని సంపాయించి ఖర్చు పెట్టుకోవాలనే 'ఆశ' వుండేది; సినిమాకంపెనీ దివాళాతో అది అడుగంటింది. కాని ఇప్పుడు శివ పర్సు బరువుగా వున్నంతకాలమూ– తన 'ఆశ' దినదినాభివృద్ధయ్యే అవకాశం కూడా వుంది.

మొదట్లో శివను అప్పుగా అడిగేందుకు ఆత్మగౌరవం అడ్డుపడేది. కాని శివ డబ్బుమీద చూపే నిర్లక్ష్యత– రాజాలో లేని ధైర్యాన్ని తెప్పించి అడిగించింది. ఇప్పుడు రాజా అడగటమూ, శివ కాదనకుండా ఇవ్వటమూ – ఇద్దరికీ అలవాటై పోయింది. రాజా – తను తిరిగి ఆ అప్పును తీర్చలేని స్థితిలోవున్నా, ఆత్మగౌరవార్థం 'చేబదులు' అనే మాటను అడ్డం పెట్టుకుంటున్నాడు.

అందరిలాగే రాజాకూడా తను పూర్ణను ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్నాడు; ప్రేమించటమైతే సులభమైన పనేకాని, దాన్ని సాధించటంకానీ, మళ్ళించుకోవటం కానీ అంత సులభమైంది మాత్రం కాదని రాజాకూ స్వానుభవం వల్ల తెలుసు! స్నేహితుడు – ఆపత్ బాంధవుడూ అయిన శివ ఆమె భర్త! ఆమె మాంగల్యం జ్ఞాపకమొస్తున్నంతసేపూ 'మిత్రద్రోహం' అనే పదం అతని హృదయాంతరాళంలో మారుమ్రోగేది! ఆ ఒక్కనాడు మాత్రమే రాజా ఆమెను చూశాడు; ఈ మూడు నెల్లలోనూ మళ్ళీ తనకు మంచి అవకాశం రానూలేదు; వచ్చినా ఒకరకం వేదాంతంతో ఆ వాంఛను తాత్కాలికంగా రూపుమాపుకొన్నాడు. ఏమైనా ఆమె విగ్రహం ఇంకా తన కళ్ళల్లో మెసులుతూనేవుంది. ఆమె తలపుకు వచ్చినప్పుడల్లా గతసంవత్సరంనుంచీ తనలో కరుడుకట్టుకు కూర్చున్న 'బ్రహ్మచర్యం' దెబ్బతిన్న తాచులాగు తోకమీద లేచి నిలబడుతుంది! ఆ ఆలోచనలతో బుర్ర ఎంతగా చెడగొట్టుకున్నా– ఆమె తనకు 'గగనకుసుమం' అనీ, తనది అంతా వ్యర్థప్రయత్నమేననీ తనకు తెలీకపోలేదు.

# 8

పూర్ణ మళ్ళీ హెచ్చరించింది; "డబ్బు వృథాగా ఖర్చయిపోతోంది-"

'ఫరవాలేదులే' అన్నట్టు శివ వెకిలినవ్వొకటి నవ్వాడు.

"మీ ప్రవర్తనకూడా చాలా మారిపోయింది."

'అట్లాగా' అన్నట్టు చూశాడు- శివ.

తనకు తెలీకపోలేదు- తనలోని మార్పులు. పుట్టిబుద్ధెరిగినప్పటినుంచీ ఒక్క ధనవ్యయకళనే తను నేర్చినట్టు ఇప్పుడు దాన్ని ప్రదర్శిస్తున్నాడు.

చిన్నప్పుడు తన తల్లి "మావాడు కలెక్టరీపని చెయ్యాలి" అనేది; తరువాత 'బిల్లుకలెక్టరు' ఉద్యోగం ఒకటివొచ్చినా, దాన్ని మాతృవాక్య పరిపాలకుడిలాగు- లెక్క చెయ్యలేదు. ఇప్పుడు తన తల్లిమాటలు కొద్దిమార్పులతో యదార్థమయినా! ఇదికాక, మరికొన్ని దుర్గుణాలుకూడా శివను పట్టుకున్నై. అందులో స్పెన్సర్ కంపెనీకి- పదిసార్లు తిరగటమూ, మరో స్త్రీని తను జేరదియ్యటమూ - ముఖ్యమైనవి.

"మీరు ఆలోచించండి; ఈనాడు ఉన్నదంతా ఖర్చు పెట్టుకుంటే- రేపు బొచ్చె చేతికివస్తుంది-"

"రేపటిదాకా బతికివుంటే చూసుకోవచ్చు."

"అప్పుడు ఏడ్చి మాత్రం ఏం ప్రయోజనం? కొద్దిలో ముడుచుకోవాలి. డబ్బు ఖర్చుపెట్టటాన్ని నేర్చుకోనక్కర్లేదు చూడండి: ఇప్పటికి మనదగ్గరవున్న రొక్కమంతా మూడుమాసాల్లోనే వృథాగా ఖర్చయిపోయింది. రోజులు గడవటమే కష్టసాధ్యమనిపించే రోజులు ఇంకా ముందున్నయ్యేమోననే భయంకూడా కలుగుతోంది. ఇది అయ్యాక-?"

శివదృష్టి ఆమె శరీరంమీది నగలపైకి పోయింది. వెంటనే ఆమె దాని అర్థాన్ని గ్రహించి అంది: "నాకేమీ అభ్యంతరంలేదు. నావికుణ్ని నమ్మి సముద్రయానంచేసే ప్రయాణీకుడిలాగు నేనుకూడా నా భావినంతటినీ ఒక్కసారే నిర్ణయించుకొన్నాను... ఆ తరువాత?"

శివ ఇంటివాసాల్ని లెక్కపెట్టసాగాడు.

"బతికిన నాల్గురోజులూ సుఖంగా బతకమన్నారు-"

"ఎవరూ?"

"దొరవారు"- తనను చూపుకున్నాడు.

"డబ్బున్నంతసేపేగా- మన దొరతనాలు? ఎందుకండీ యీ మెట్టవేదాంతం? సంసారబాధ్యత స్త్రీకి తెలిసినట్టు - పురుషుడికి తెలీదు. నామాటకూడా కొంతవరకూ సాగనివ్వండి..."

అప్పటికిమాత్రం యథాప్రకారంగా శివ తలవూపాడు. ఆమె యేదో ఆలోచించి, అతని పాదాలదగ్గర కూర్చొని అంది: "రోజులో ఇరవైగంటల కాలాన్ని మీరు లేకుండానే గడపాల్సివస్తోంది. అసలు నేను ఇంకా యీలోకంలో బ్రతికివున్నాననే మాటనే మీరు మరచిపొయ్యారుకదూ?... ఈ ప్రవర్తనతో నాకు భరించలేని బాధను కలిగిస్తున్నారు. మీ పాదాల్ని తాకి చెప్తున్నాను: నాకోసం కాదు. మనం ఒకళ్ళనొకళ్ళం నమ్మకపోతే యీ జీవితమే కష్టమైపోతుంది. సరిగ్గా భోజనం వేళకైనా ఇంటికి రాకపోతే మీ ఆరోగ్యం పాడవుతుంది... రోజూ మీ రాకకోసం ఎదురుతెన్నులు చూస్తూ కూర్చుంటున్నాను... ఇది అనవసరమనకండి. కష్టాల్లోనూ, సుఖాల్లోనూ కూడా నాకూ భాగం వుందిగా... మీకళ్ళు చూడండి- ఎర్రగా చింతనిప్పుల్లాగు ఉన్నై. ఆ డబ్బే మిమ్మల్ని అధోగతికి లాగుతోంది- నా మాటను ఒక్కసారి చెవినివేసుకోండి..." ఇంక ఆమె చెప్పలేకపోయినా, ఆమె కంటివెంటకారే నీరు శివపాదాల్ని తాకి బతిమాలుకొంది.

గొప్పనేరం చేసినవాడిలాగు బెదరిన చూపుల్ని చూస్తూ- ఎంత ప్రయత్నించినా ఆ స్థలాన నిలువలేక లేచి నిలబడి: "వృథాగా దిగులుపడుతున్నావ్... అనుమాన పడుతున్నావ్ - మరేం భయం లేదు-" అని తటాలున తలుపు తెరిచి బజార్లోపడ్డాడు. పమిటచెంగుతో నిరుపయోగమైన కన్నీటిని తుడుచుకొంది- పూర్ణ.

❋ ❋ ❋

ఆమెకు ఇదొక భీకరసమస్యయింది. ఏరాత్రి శివ తూలుతూ ఇంటికి వచ్చాడో, అతని నోటి వాసనను తను ఏనాడు భరించలేకపోయిందో - ఆనాటినుంచే శివ ఆమె ఊహలన్నింటినీ ఆక్రమించుకొన్నాడు. అంతేకాదు... తెచ్చినరొఖ్ఖం అయిపోయింది. తరువాత తన శరీరంమీది బంగారం దాదాపు అంతా ఏ అనంతంలోనో ఐక్యమైపోయింది. తనకు- ఆ అనుభవించినదానిలో పిసరంత భాగమైనా లేదని తెలిసినా- ఆమె అభ్యంతర పెట్టలేక పోయింది. బహుశా శివ ఆమె ఆభరణాల్ని అడిగేప్పుడు ఉపయోగించే కంఠమూ, భాషా కలిసి తనను మాట్లాడనిచ్చి ఉండవు.

ఇంకా మిగిలివుంది- ఆ గొలుసూ, మాంగల్యాలు మాత్రమే! దాని వాయిదా ఎప్పుడో ననుకుంటూ మెల్లిగా దాన్ని పట్టుకొని, వేళ్ళసందునుంచి తిప్పసాగింది. డబ్బు పుష్కలంగా ఉండటం మూలానే ఇన్నాళ్ళూ తనను పువ్వుల్లోపెట్టి పూజించిన శివకు ఈనాడు తనపైని తృణీకారభావం ఏర్పడ్డది.

ఇల్లాటి వాతావరణాన్ని తనెప్పుడూ కోరనేలేదు. తను తలవని ఘట్టాలెన్నో జీవితంలో సంక్రమిస్తున్నయ్. శివ హృదయాన్నీ, ఆత్మనూ కూడా వశపర్చుకున్నాననే దుర్భ్రమతో కూడిన ఆమె మనోగర్వమంతా పటాపంచలైంది. తను ఏడ్చి మొరపెట్టుకుంది- కాని శివ హృదయం అందుకు నిజమైన పరివర్తననే

రూపించలేకపోయింది! ఈనాడు తను కంటోందీ, వింటోందీ, అనుభవిస్తోందీ కూడా ఒక్క 'బాధే!' మానవజీవితమే సరిగ్గా- ఎగుడు దిగుడు లేకుండా ఉండనప్పుడు - వారి ప్రేమకు నిలకడ ఎక్కడిది? ఆమె కొత్తగా నేర్చిన పాఠమిది!

ఏకాంతాన హృదయంలో ఇమిడేందుకు వీల్లేని దుఃఖమంతా ఆమె కన్నీటిరూపాన బైటపడ్డది. ముఖాన్ని తలగడాలో కూరుకొని వెక్కి వెక్కి ఏడ్చింది- కాని ఎవ్వరూ తన దుస్థితికి సానుభూతి తెలుపలేదు. ఇదివరకు తను- ఇదే స్థితిలోఉన్న వ్యక్తుల కెవరికైనా సానుభూతి చూపిందా?

ఎవరికైనా చెప్పుకోవటంకూడా సిగ్గుచేటు! విన్నవారు 'కులటవు- అంతే కావాలి; విధి విధించేశిక్ష!' అని సంతోషిస్తారు. ఒకరి బాధ వేరొకరికి ఆనందం కాబోలు! ఎంత తలవొంచినా, తనను క్షమించేవాళ్ళు లేరు. పై పెచ్చు అధఃపాతాళానికి తొక్కేస్తారు. విచారం ఆమెను కృంగదీసింది!

మూడురోజులైంది- ఆ మూర్తి తనకు కన్పించి. ఎవరితో మొరపెట్టుకుంటుంది- తను? 'దిక్కులేనివారికి దైవమే దిక్క'ని తలచింది. ఎంత చెప్పుకున్నా... ఆ దైవం కూడా తను 'పతిత' అనే కాబోలు ఏకు మేకై కూర్చున్నాడు! రెండు రోజుల్నుంచీ అన్నం తినలేదు. ఆకలిమంటకు విస్తరి ముందు కూర్చుంది- సయించలేదు. కంటి నుంచి కారిన నీటితో అన్నం అడుసైపోయింది. ఇదంతా మరచిపోతే ఎంత హాయిగా వుండును. కాని బాధను ఎల్లా మరచిపోవటం? దీని సాధన తెలుస్తే జీవితం ఇంత కష్టమనిపించదేమో?

దాదాపు రెండు గంటలదాకా ఆమె ఆలోచన తెమలలేదు. నిస్సహాయ-తనేం చెయ్యగలదు? ఆనాడు శివకు పురోగామిగా వచ్చిన స్నేహితుడే ఇంక దిక్కు- ఇది ఆమె ఆలోచనా పర్యవసానం.

మరుక్షణంలో ఆ ఇంటి తలుపుకు తాళంపడ్డది.

## 9

కూనిరాగంతో పద్యాన్ని బట్టీపెడుతూన్న రాజా హఠాత్తుగా తలెత్తి- ఎదుటవున్న వికృతాకారాన్ని చూసి హడలిపొయ్యాడు. పిచ్చిది ఎవత్తయినా బిచ్చానికి వచ్చిందేమోనని ఠకీమని లేచి నిలబడ్డాడు. కాని తన పరిశీలనా దృష్టి వెంటనే ఆనవాలు పట్టింది. ఆమే! ఇక్కడి కెందు కొచ్చిందీ? ఈనాల్లు నెల్లలోనూ ఎంత మారిపోయింది! ఆమె ఫాలభాగంమీది చిరుచెమటల్లో కూరుకుపోయిన ముంగురులూ- ఎక్కువ ఊపిరిని పీలుస్తూండటం వల్ల కిందికీ, పైకీ వేగంగా లేచి పడుతూన్న ఉన్నతవక్షమూ- ఆమె స్థితిని తనకు కొంతవరకూ నివేదించుకొంటున్నై. ఆ రాత్రి సమయాన తనకోసమే

వచ్చింది కాబోలు! ఇంత భాషలో ఆమెతో మాట్లాడేందుకు పదజాలాన్ని కొంచెం కష్టంతో వెతుక్కోవాల్సి వచ్చింది...

"ఏ-మండీ?"

ద్వారబంధంలోనే నిలబడి, "వారిక్కడున్నారా?" అంది. ఆమె కావాలని కానీ, సహజంగా కానీ సిగ్గును నటించలేదు.

"లేరు."

"ఎక్కడుంటారో చెప్పగలరా?"

పైచూపుల్తో కాసేపు ఆలోచించి రాజా అన్నాడు:

"అదికొంచెం రహస్యంగా చెప్పాల్సిన విషయం... ఇక్కడకాదు- లోపలికి రాండి- చెప్తాను."

ఆమె మాట్లాడకుండా, మంత్రముగ్ధవలె అతన్ని అనుసరించింది. రాజా, పక్కగదిలోకి తీసుకువెళ్ళి కుర్చీచూపాడు- తను క్యాంపుకాట్ మీద కూలబడుతూ.

ఒక్కక్షణంపాటు గదిలో నిశ్శబ్దదేవత ప్రత్యక్షమైంది. తరువాత గట్టిగా ఊపిరిపీల్చి ఒక ఉపన్యాసధోరణిలో రాజా అందుకున్నాడు: "వాడి చర్యలు నాకేమీ బాగుండలేదు: ఈ విషయం మీకు చెప్పితీరాలనే ఉద్దేశం నాకూ ఉంది. చూడండి: ఎక్కణ్ణుంచి తవ్వుకొస్తున్నాడో కాని, వాడికి రూపాయిలు... దమ్మిడీలుగా ఉన్నై. నాతోటి స్నేహాన్ని కూడా తగ్గించాడు. అసలు వాడితో తిరుగుతూంటే ఆ బుద్ధులు నాక్కూడా అలవాటై చెడిపోతా నేమోననే భయంకూడా కలుగుతోంది. ఇంతేకాదు: ఏ స్నేహితుడి ద్వారా అలవడిందో కాని- తాగుడుకూడా మరిగాడు. అది మానమని నేను బతిమాలాను, భంగపడ్డాను. ఒక చెవినుంచి జొరపడ్డ నా మాటలన్నీ రెండో చెవినుంచి గాలిలో కలిసి కరిగిపొయ్యాయ్... ఆ తాగుడులో తనకేదో పిచ్చి ఆనందముందంటాడు. ఏమైనా - వాడు నాశనమౌతూ, మీ జీవితాన్ని కూడా నాశనం చేస్తున్నాడనుకుంటా-"

ఆగి ఆమె వైపు చూశాడు; తన మాటలు ఆమెలో శివ మీద ఈర్ష్యను పుట్టిస్తవనుకొన్నాడు. కాని ఆమెలో చలనమేలేదు. తన మాటలన్నీ విగ్రహంముందు చదివే సహస్రనామాలయ్యాయ్-

"ఇంకో స్త్రీతోకూడా సంబంధం వుంది-" సంకోచనను సూచిస్తూన్న కంఠంతో అన్నాడు.

"ఎవరామె?" తల ఎత్తకుండానే అడిగింది: ఆతృత లేదా కంఠంలో!

"శ్రీదేవట... ఆ స్త్రీ... ఒక ఆరినదీపం, వీడు దాన్ని ఉద్ధరించట మేమిటో నాకు అర్థమవటంలేదు- కాంతా కనకాలు రెండూ కలిసి వాణ్ని సుడిగుండాల్లోకి లాగేస్తున్నాయ్. ఇప్పటికే చెయ్యిజారి నీటపడ్డ ముత్యమయింది- వాడినడవడి-"

నమ్మిందా తన మాటల్ని? కోపంకానీ, ఈర్ష్యకానీ ఆమె ముఖంలో కన్పించదే! వాతావరణం యీ మానవమాత్రురాలిమీద- తన శక్తినికూడా కోల్పోయిందా? తను ఆమెను యీ రాత్రి మొదట చూచినప్పటి విచారవదనమే- ఇంకా మారలేదు! రాజా ఇంకా మాటల్ని వెతుక్కోసాగాడు- ఆమె హృదయంలోని కోపజ్యోతిని ప్రజ్వలింప జేసేందుకు!

"అంత విద్యాధికుడు - ఇంత నీచుడౌతా డనుకోలా- భార్యకు తీరని అన్యాయం చేస్తున్నాడు; ఏ హిందూగృహిణీ సహించి భరించలేని పరాభవాన్ని మీ పైన ప్రయోగిస్తున్నాడు- బైటనుంచి చూసే నాకే ఇది చాలా కష్టమనిపిస్తోంది. దీనికి మీరు వెంటనే జాగ్రత్త తీసుకోవాలి-"

ఆమె వికటాట్టహాసం రాజా నోటిని కట్టేసింది.

"కట్టుకున్న భార్యల్నే గడ్డిపోచగా చూస్తూన్న వాళ్ళింతమంది ఉండగా- లేచి వచ్చిన స్త్రీకి అంతకన్న ఆధిక్యత ఉంటుందా?"

ఆమెకు పిచ్చెక్కలేదు కదా! 'లేచి వచ్చిన స్త్రీ!' ఆమె నోటి మాటలేనా ఇవ్వి? ఈ నూతన విశేషం తనకు ఇప్పటిదాకా తెలీదని- ఆమెకు తెలీదా? మళ్ళీ అడుగుదామనుకున్నాడు. ధైర్యం చాలలేదు.

"పోనీండి- ఆ శ్రీదేవి ఇల్లెక్కడో చూపుతారా? వారిలో లేని సంస్కారాన్ని నామాటలు ఇవ్వగలవనే ధైర్యం లేదు కాని- ఐనా ప్రయత్నిస్తాను-"

ఎక్కడిదీ వేదాంతం? రాజా పూర్తిగా నిరాశలోపడ్డాడు. ఆమె- తనకు జరుగుతూన్న హానిని కూడా లక్ష్యపెట్టని వ్యక్తా?

తలవూపి... ఆమెను వెంటపెట్టుకొని తీసుకువెళ్ళి దూరం నుంచే- ఆ కొంపను చూపి 'ఉంటాను' అని స్వస్తిచెప్పి - ఈ విచిత్రవ్యక్తిని గూర్చి ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టాడు-రాజా!

## 10

"శివరావుగారు- ఇక్కడున్నారా?"

విచిత్ర మృగాన్ని చూసే విధాన పూర్ణను తేరిపారజూస్తూ ఆమె, "నువ్వెవరు -వారింటి దాసీవా?" అంది.

తన ముఖకళనుపట్టీ, దుస్తులతీరును పట్టీ లోకం తన విలువను కట్టేస్తోంది. 'దాసీ!' -తన బతుకు అంతకన్నా హీనంగా కూడా వుందేమో!

"ఔను-"

దాసీని 'దాసీ' అన్నా ఇంత నదురూ, బెదురూ లేని సమాధానం వచ్చేది కాదేమో!

విలాసంగా చూసి ఆమె - నవ్వింది! స్త్రీ - తనజాతి పరాయి వ్యక్తిని నిర్లక్ష్యతతో చూడటం - పూర్ణ అనుభవంలో ఇదే మొదటిసారి.

మేడమీదికి వెళ్ళే మెట్లను చూపుతూ, "ఆపైన ఉన్నారు- వెళ్ళు" అంది.

అదే పదివేలు! తను ఇప్పుడు దాసీ పాత్రను ధరించి ఉండకపోతే బైటికి గెంటబడేదేమో కూడా!

చీకట్లో- మెట్లను కాలితో తడివి చూసుకుంటూ పూర్ణ పైకి వెళ్ళింది. కటికనేలమీద ఒళ్ళు తెలీని మైకంలో శివ పడి ఉన్నాడు. అతని బట్టలుకూడా సరైన స్థానంలో లేవు. అనంతాకాశంలోని తారలగుంపులూ, అర్ధచంద్రుడూ మాత్రమే అతన్ని చూసి నవ్వుకుంటున్నారు.

అతన్ని తట్టింది. పేరున పిల్చింది. అటూ, ఇటూ ఊపింది; కదిలాడు... మృత్యుముఖంనుంచి బైటపడ్డ సత్యవంతుడిలాగు ఎర్రని కళ్ళను నలుపుకుంటూ- ఇంకా మత్తులోనే, "ఎవరూ?...శ్రీ? ఇందాకట్నుంచీ ఇక్కడే ఉన్నావా?" అన్నాడు.

పూర్ణ గాద్గదిక స్వరంతో సమాధానమిచ్చింది: "నేను శ్రీనికాదు... ఒక అనాథ స్త్రీని... మీతో లేచి వచ్చి... మిమ్ము వెతుక్కుంటూవచ్చిన పతితను... కొంచెం తెలివి తెచ్చుకోండి. మంచినీళ్ళు కావాలా?-"

శివకు మరికొంచెం తెలివివచ్చి తలఊపాడు. ఆమె కిందికి వెళ్ళి ఇంటివార్ని ఆడిగి తెచ్చిన నీళ్ళు తాగాక - శివకు పూర్తిగా తెలివి వచ్చింది. వెంటనే ప్లేటు మార్చాడు.

"ఇక్కడి కెట్లా వచ్చావ్?"

"మీకోసం-"

వికటంగా నవ్వాడు- హృదయంతో కాదు, పైకి కన్పించే గొంతుతో!

"ఇట్లా ఉన్నావేం? నాకోసం వెతుక్కుంటూ వచ్చావా? నేను తప్పిపొయ్యేటంత చిన్న కుర్రవాణ్ని కాదులే-"

తన మీద జాలా? తనకంతా అపరిచిత వాతావరణంగానే వుంది.

కుర్రవాణ్ని ముద్దుగా మందలించినట్టు ఆమె అందుకుంది: "మీరు రోజు రోజుకూ మారిపోతున్నారు. నేను మీకేం హానిచేశాను? ఇంటి ముఖమైనా చూడకుండా ఇక్కడ పడివుండటం మీకు న్యాయమని తోచిందా? నా వల్ల ఏదైనా తప్పుఉంటే శిక్షించండి. మీకళ్ళు చూసుకోండి- వేళాపాళాలేని వెధవ అలవాట్లతో అనారోగ్యం కన్పించడంలేదా-

ఆ కళ్ళల్లో? ఇక్కడ ఈ ఇంట్లో మిమ్ము ఆదరించేవారేరీ? నమ్మాను: మీరు నా జీవితపథానికి తోడు నీడై ఉంటారని – అన్నం తిన్నా, తినకున్నా అడిగే దిక్కయినాలేని యీ స్థలాన్ని అంటిపెట్టుకు కూర్చోటం నా మూలానే కదూ?....”

“ఏమిటీ ఉపన్యాసం?

“నేను మీకు ఉపన్యాసాల ద్వారా నీతుల్ని నూరిపోసేందుకూ, మీ ప్రవర్తనను ఖండించేందుకూ రాలేదు. మన స్థితిగతుల్ని ఒక్కసారి వెనక్కు తిరిగి చూచుకోమని ప్రార్థించేందుకు వచ్చాను. ఆనందాన్ని అనుభవించటం మానవుడి జన్మహక్కనే సిద్ధాంతాన్ని నేను ఒప్పుకుంటాను– మిమ్ము అడ్డుపెట్టే అధికారం నాకు లేదు. ‘నా’ అనుకున్న ఒకవ్యక్తి జీవితాన్ని పాడుచేస్తున్నాననే భయం ఏర్పడ్డది– ఒక్కసారి ఇంటికి వస్తే అన్నీ చెప్పుకుంటాను–”

తన బాధను ఇముడ్చుకొన్న భాష ఇదేనని ఆమె నమ్మింది. దీనత ఉట్టిపడే కంఠంతోనూ, జాలి కొలిపే చూపుల్తోనూ అతనికి విషయాన్ని బోధపరచ గలిగాననుకొంది: కాని ఇక్కడ ఆమె పూర్వస్వానుభవంకూడా పనిచేయక, ఆమెను తప్పు అభిప్రాయాల్లోకి తోసేసింది.

“పూర్ణా! వస్తాను– ఇప్పుడు కాదు– రాత్రి ఒంటిగంటకు–”

ఇంకా నాలుగ్గంటలయ్యాక! తన మొర ఇచ్చిన తుది అవకాశం ఇదే కాబోలు! ఆమె హృదయం గాయపడ్డది. తన విశ్వాసమూ, ఆవేదనా, త్యాగమూ అన్నీ కలిసి తనకే ఎదురు తిరిగినయ్. తనను తనే నమ్మలేని వ్యక్తిగా పూర్ణ ఇప్పుడు తయారైందంటే – ఆశ్చర్యపడనక్కర్లేదు. లేరు – తనను ఆదరించేవాళ్ళే యీ విశ్వంలో లేరు! తను స్త్రీ, అసహాయా అవటంవల్లనే కాబోలు– యీకీడు? ఎవరిమీదా ఆమెకు కోపంరాలేదు. పశ్చాత్తాపంతో మగ్గిపోతూన్న ఆమె హృదయంలో పెద్దగా ప్రజ్వరిల్లే దుఃఖాగ్ని – కన్నీటి రూపాన అతన్ని తాకాయ్; కాని ఆ చర్మానికి స్పర్శజ్ఞానంకూడా లేదనుకుంటాను.

“చెప్తున్నాను– వెళ్ళిపో– అనవసరంగా ఏడ్వడం మాత్రం మీ జాతికి బాగా తెలుసు–” కఠోర ఆజ్ఞ ఇది! ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

“ఎందుకూ? నేను వస్తే సరిగా! నిజంగా వస్తాను పూర్ణా! వెళ్ళు–”

“అందాకా కింద వుంటాను–”

“కాదు– ఇంటికి పో–” తొందరను సూచించాడు.

తప్పదు– తనకు ఏదీ తప్పదు. మారు మాటాడకుండా ఆమె నీరసంగా మెట్లు దిగ నారంభించింది.

## 11

రాత్రి రెండు గంటలయ్యేవరకూ- పూర్ణ కళ్ళల్లో కలికాలేసుకొని, శివ రాకకోసం ఎదురు చూస్తూనేవుంది. ఆ రాత్రి ఆమె నిరాశతో విడిచిన నిట్టూర్పులకు అంతులేదు.

తలుపు తట్టిన శబ్దం. శివ మాట చెల్లించుకొని వచ్చాడు కాబోలు. తృళ్ళిపడుతూన్న హృదయాన్ని చిక్కబట్టుకుంటూ పరుగెత్తుకు వెళ్ళి తలుపు తెరిచింది- తిరిగి నిరాశ! రాజా నేలచూపుల్ని చూస్తున్నాడు-

"రాం-డి"

రాజా లోన ప్రవేశించి కుర్చీలో కూలబడ్డాడు. రెండు నిమిషాలపాటు ఎవరి పెదవులూ కదలనేలేదు. మొట్టమొదట రాజాయే నిశ్శబ్దతకు భంగం కలిగించాడు.

"మీకొక దుర్వార్తను తేవలసి వచ్చింది-"

"చెప్పండి."

రాజా సంకోచిస్తున్నాడు.

"నాకేం భయంలేదు. కష్టాలకు గురైన తర్వాత గుండెను రాయి చేసుకొన్నాను. గడిచిన దానిలో- రాబొయ్యేది ఎంతదైనా- ఒక భాగమే ఔతుంది. నిండా మునిగిన వాళ్ళకు చలేమిటి? మీ రేమీ సంశయించ నక్కర్లేదు. అన్నింటికీ సిద్ధంగానే వున్నా-"

ఎక్కడిదీ మొండిధైర్యం? స్త్రీ హృదయంలోని పాషాణ భాగాల ప్రదర్శన కాబోలు!

"ఏమీలేదు- వాడు జైల్లో ఉన్నాడు."

ఇది విన్నాక ఆమె పెద్దపెట్టున ఏడుస్తుం దనుకొన్న రాజాకు ఆశాభంగమే ఐంది.

"దేనికీ?" అంది నిశ్చలంగా చూస్తూ.

"రాత్రి- శ్రీదేవిని ఖూనీ చేశాడు."

వికటంగా నవ్వింది. కురులు కప్పిన ఆమె ముఖంలోని భావం అస్పష్టంగా వుంది.

నిట్టూర్చి అంది: "ఇల్లాటిదేదో జరుగుతుందనే అనుకుంటున్నా ... ఏదైనా ఉపాయం వుంటే యీ గొలుసు అమ్మి వార్ని తప్పించండి-"

ఆ దౌర్భాగ్యుడి మీద ఆమెకింకా ఆశ ఎందుకో రాజాకు అవగాహన మవలేదు. ఖూనీ కోరు- నమ్మిన స్త్రీ జీవితం భగ్నం చేశాడు. ఏ హృదయంగల స్త్రీ వాణ్ని క్షమించగలదు? క్షమకుమాత్రం లేదా-మితి?

"అది అసాధ్యం - వాడంతట వాడే పోలీస్‌స్టేషన్‌లో స్టేటుమెంటు ఇచ్చి జైల్లో కూర్చున్నాడు- మీరు విచారపడికూడా లాభంలేదు. ఎవడి పాపం వాణ్నే నాశనం చేస్తుంది."

"మీకిది అర్థంకాని విషయం. వారు నామూలానే చెడిపొయ్యారు. నా ప్రోద్బలం మీదనే ఇటు వచ్చారు. ఈ చేతులమీదుగా ఇచ్చిన డబ్బుతోనే వారు తన అంత్యాన్ని వెతుక్కున్నారు- పోనీండి. వార్ని చూసే ఏర్పాటేదైనా వుందా?"

"మిమ్ముకూడా చూడాలంటున్నాడు- ఏర్పాటుచేసే వచ్చాను-"

"వెళ్దాం-"

ఇద్దరూ కలిసి బైలుదేరారు.

## 12

ఇద్దరి మధ్యా ఇనుపచువ్వలు అడ్డం.

"వచ్చావా- పూర్ణా?" పొడిగొంతుకతో, జాలిగా అన్నాడు- శివ.

ఆమె హృదయంలోని విచారవాహిని ఒక్కసారిగా పొంగి, పొర్లింది.

"ఆc. వచ్చా- ఇలవేల్పుగా పూజించుకొన్న స్వామికోసం! ఏ వ్యక్తి జీవితాన్ని కూకటివేళ్ళతో కొరికి పారేశానో- వార్ని చూసి, చేతకాని తనాన్ని రూపించుకొనేందుకు వచ్చా."

ఆమె పమిటచాటున భోరున ఏడ్చింది.

చువ్వల్లోంచి చేతులుజాపి ఆమె ముఖాన్ని ఎత్తి, శివ - చెదిరిన ఆమె ముంగురుల్ని పైకి సర్దాడు.

"ఏడ్చి ఏం ప్రయోజనం? మిన్నూ, మన్నూ ఏకమైనంత ఉద్రేకంలో చేశాను యీ పనిని... మితిలేనికోపంతో నాకు ఏవిధమైన అధికారమూలేని ఒక స్త్రీమీద- యీ శిక్షను ప్రయోగించాను. ఆ స్త్రీ 'నాది' అనే దురాశతో- ఈర్ష్యతో, ఆమెను చంపాను. పూర్ణా! ఇప్పుడొస్తోంది పశ్చాత్తాపం- దీని సాఫల్యతే నా గొంతుకు పడబొయ్యే విడనిముడి - ఎవ్వరూ నన్ను క్షమించలేరు- నువ్వు నా జీవితాన్ని రాణింపచేద్దామనుకొన్న దేవతవు. కాని నిన్నే కాదని తన్ని అవమానం చేశాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను- పూర్ణా! ఒక సాధు స్త్రీని - అంధకార బంధుర జీవితమార్గంలోకి నట్టేట దిగవిడిచాను. ఈ ప్రభుత్వానికీ సంఘానికీ కూడా ద్రోహంచేశాను. నన్ను అమాయకంగా నమ్మావ్- మొదట ఆదరిద్దామనుకొన్నా- కాని అంతా ప్రతికూలంగానే ప్రవర్తించా. ఐపోయింది- నాకు నేనైవచ్చి శిక్షను అనుభవిస్తా."

ఇద్దరూ కొన్ని నిమిషాలపాటు మాట్లాడలేదు. శివ ఆమె హస్తాన్ని తన హస్తంలోకి తీసుకొన్నాడు. తాము బయలుదేరే ఆ మొదటినాటి ఆమె హస్తాల గాజుల కమనీయ శబ్దం లేదీనాడు. తను ఆమెను నిర్దయగా, నిర్లక్ష్యంగా నలిపి పారేశాడు. తన పాదాలకిందపడి నలిగిపోయినజీవి- ఇంకా తన కోసం కన్నీరు కారుస్తోంది- శివకు కళ్ళు తిరిగాయ్.

రక్తసిక్తవస్త్రాల్తో తను యీ నాలుగు గోడల మధ్యా నివాసాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు- చేతులారా చేసుకొన్న పాపం- ఎంత దుర్బుద్ధి!

“ఏదైనా ఉపాయం-”

అర్థోక్తిలోనే అందుకొని శివ అన్నాడు: “దేనికీ? నీ పరమశత్రువును తిరిగి నెత్తి కెక్కించుకుంటావా? నీది నేరంలేని శిక్ష; నాది శిక్ష చాలని నేరం! నేను యీ కాస్త శిక్షనైనా అనుభవించకపోతే- నా ఆత్మకు తృప్తి వుండదు. నాలోని పిరికితనమంతా ఏమైందో నాకే ఆశ్చర్యంగా వుంది- నాకు నేనై మృత్యుదేవతను ఆహ్వానించుకొంటాను.”

మరికొన్ని నిమిషాలపాటు ఇద్దరూ మౌనంగానే ఉన్నారు. శివ ఏదో ఆలోచించుకొని అన్నాడు: “మీ ఊరు వెళ్ళిపోరాదూ?”

“వీల్లేదు.”

“ఒక్కపని చేస్తావా?”

“ఏమిటి?”

“ఉరిపడబొయ్యే ఖైదీకోరే తుదికోర్కె- ఇది.”

“చెప్పండి-”

“ఆ రాజాతో- ఉంటావా?”

“ఇదేనా మీరు నాకు చెప్పే సలహా?”

“కాదుపూర్ణా! నే చేసిన నేరానికి నీకు విధింపబడే శిక్ష ఇది! ఇంతకన్న వేరుమార్గం లేదు పూర్ణా! పతిత స్త్రీలకు మార్గమిదే! ఒక స్త్రీకూ, అసహాయకూ ప్రతిఫలం కోరకుండా సహాయంచేసే వ్యక్తులు- యీ దేశంలో బహుకొద్ది. ఇది నా అంత్యసందేశం-”

ఆమె వింటూ నిలబడ్డది. రాజా విగ్రహం తనకట్టెదుట నిలబడ్డది. తను ఈ ప్రపంచంలో ఇంకెవర్నీ నమ్మలేదు- తన ఆత్మను కూడా నమ్మలేదు. తన స్త్రీత్వానికి మాత్రమే ఆశపడే యీ లోకమే తనకు అక్కర్లేదు. తనలాటి జీవచ్ఛవాన్ని అంటకట్టే దుర్మార్గాన్ని కూడా తను భరించలేదు.

శివ పాదాల్ని తాకింది: “ఇంకేమీ ఒద్దు- నేనే వెళ్ళిపోతాను.”

“ఎక్కడికి వెళ్తావు?”

"ఏమో!... లోకమంతా యీనాడు నాకు అర్థమైంది. నన్ను పోనివ్వండి- మీ పాదాలకు ఇదే నా తుది నమస్కారం."

నీళ్ళతో నింపుకొన్న రెండు కళ్ళనూ తుడుచుకోకుండానే లేచి నిలబడ్డది. శివ ఏదో చెప్పబొయ్యాడు, ఆమె విన్పించుకోకుండానే చరచరా సాగిపోయింది.

బైట కునికిపాట్లు పడుతూన్న రాజా దిగ్గునలేచి, "వెళ్ళిపోతున్నారేం?" అన్నాడు.

ఆమె సమాధానమివ్వలేదు- ఎదుట రక్తవర్ణంతో అస్తమించబోతున్న చంద్రునివైపు పరుగెత్తింది. రాజా- ఆమె పూర్ణకాదనే వుద్దేశంతో మళ్ళీ కునికిపాట్లు పడసాగాడు.

వెనుకనుంచి శివ "పూర్ణా!... పూర్ణా!" అని జైలుగోడలు ప్రతిధ్వనించేట్టు అరిచాడు- రాజాకు అంతవరకూ తెలివిరానేలేదు.

- అక్టోబరు, *1940*